తెలంగాణ **TELANGANA MUCHATLU**

# ముచ్చట్లు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | ఆదివారం - 20 - సెప్టెంబర్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 107 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# వరంగల్ విమానాశ్రయ కలకు కొత్త ఊపిరి

**మామునూరులో కీలక దశకు చేరిన ప్రాజెక్టు**

**భూసేకరణ పూర్తితో వేగం పెరిగిన పనులు**

**పరిశ్రమలు, ఉపాధికి కొత్త అవకాశాలు**


**కొత్త విమానాశ్రయానికి పేరు సూచించాలన్న సీఎం**



**వరంగల్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):**

వరంగల్ మామునూరు విమానాశ్రయం ఏర్పాటు ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. అనుమతులు, భూసేకరణ, సాంకేతిక పరిశీలనల వంటి ప్రధాన దశలను పూర్తి చేసిన అనంతరం నిర్మాణ పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టాలని భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ నిర్ణయించింది. ఇప్పటికే రెండు ప్యాకేజీలకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తి కావడంతో ప్రాజెక్టు అమలుకు మరింత వేగం చేకూరనుంది. ప్రపంచ స్థాయి విమానాశ్రయం రూపుదిద్దుకోబోతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మామునూరులో నిర్మించనున్న కొత్త విమానాశ్రయానికి ఏ పేరు పెడితే బాగుంటుందో ప్రజలు సూచనలు ఇవ్వాలని కోరారు. అభివృద్ధి చెందుతున్న తెలంగాణకు

మిగతా 2లో..



# కోదాడలో కొలువుల జాతర..

* గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాల వెల్లువ
* ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ
* ప్రముఖ సంస్థల్లో యువతకు ఉద్యోగాలు
* ఉపాధి కల్పనలో మరో ముందడుగు
* మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**కోదాడ, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు)**

కోదాడలో నిర్వహించిన మెగా జాబ్ మేళా విశేష విజయాన్ని సాధించింది. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలను విస్తరించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరై యువతను ప్రోత్సహించారు. ఉద్యోగ అవకాశాల కోసం పెద్ద సంఖ్యలో యువత పాల్గొనడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు పాల్గొని

మిగతా 2లో..

# సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదు

* **ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు**
* **హైకోర్టు తీర్పుపై స్పందన**
* **స్పీకర్ నిర్ణయమే కీలకమని వ్యాఖ్య**
* **అనర్హత వ్యవహారంపై రాజకీయ చర్చ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):**

తన ఎమ్మెల్యే పదవిపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై దానం నాగేందర్ మరోసారి స్పందించారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తున్నట్లు పేర్కొంటూ, తాను వ్యక్తిగతంగా సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచనలో లేనట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ అంశంపై రాజకీయ, న్యాయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆయన

మిగతా 2లో..

# బీరం లక్ష్మారెడ్డికి ఘన నివాళులు

* **కుటుంబ సభ్యులను పరామర్శించిన నాయకులు**
* **సానుభూతి తెలిపిన కేటీఆర్**
* **ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన**



**కొల్లాపూర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):**

కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి మరణం పట్ల పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్, మాజీ మంత్రులు వి. శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు బీరం లక్ష్మారెడ్డి సేవలను స్మరించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ

మిగతా 2లో..

# దశాబ్దం తర్వాత ఆర్టీసీ ఎన్నికలు

* **కార్మిక సంఘాల హక్కుల పునరుద్ధరణ**
* **అక్టోబర్ 9న గుర్తింపు సంఘం ఎన్నికలు**
* **కార్మికుల భాగస్వామ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం**
* **ఆర్టీసీ బలోపేతానికి చర్యల వెల్లడి.. మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో దాదాపు పదేళ్ల తర్వాత కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అక్టోబర్ 9న జరగనున్న ఈ ఎన్నికల్లో ఆర్టీసీ కార్మికులు స్వచ్ఛందంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

మిగతా 2లో..



# పెళ్లైన 18 రోజులకే విషాదం

* **కళాశాల భవనం నుంచి దూకిన విద్యార్థిని**
* **వరకట్న వేధింపుల ఆరోపణలు**
* **చికిత్స పొందుతూ యువతి మృతి**
* **కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



2లో

# క్యూర్ పరిధిలో ఇళ్ల పంపిణీ

* **వేల గృహాలు పూర్తి.. లబ్ధిదారుల ఎంపికకు ఆదేశాలు**
* **9 వేల మందికి ఇందిరమ్మ ఇళ్లు.. పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):**

క్యూర్ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్

మిగతా 2లో..



# అసెంబ్లీ నిర్వహణపై వేముల విమర్శలు

* **ప్రభుత్వ వైఖరిపై ప్రశాంత్ రెడ్డి ఆరోపణలు**
* **పలు అంశాలపై విచారణకు సవాల్**
* **కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు**




**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు)**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, ప్రభుత్వ విధానాలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కోదాడలో కొలువుల జాతర..

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థుల అర్హతలు, నైపుణ్యాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత అధిక సంఖ్యలో హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. అనేక మంది యువతకు వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు లభించడం విశేషంగా నిలిచింది.

ఈ సందర్భంగా ఫాక్స్‌కాన్ వంటి ప్రముఖ అంతర్జాతీయ సంస్థల్లో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగ అవకాశాలు పొందిన యువతలో ఆనందం వ్యక్తమైంది. తమకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కార్యక్రమంలో నాయకులు సూచించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యువత ఉపాధి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని పేర్కొన్నారు. చదువుకున్న యువతకు తగిన అవకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తును బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంత యువత కూడా కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించే స్థాయికి చేరుకోవడం సంతోషకరమని అన్నారు.

జాబ్ మేళా ద్వారా వివిధ రంగాల్లో ఖాళీలను భర్తీ చేయడంతో పాటు పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను అందించే అవకాశం కలుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. యువతలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై అవగాహన పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలకంగా మారిందన్నారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అభినందించిన మంత్రి, వారి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి జాబ్ మేళాలను మరింత విస్తృతంగా నిర్వహించి వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం గ్రామీణ యువతకు కొత్త ఆశలను నింపిందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

# దశాబ్దం తర్వాత ఆర్టీసీ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

గత కొంతకాలంగా నిలిచిపోయిన గుర్తింపు సంఘాల ఎన్నికలను తిరిగి నిర్వహించడం ద్వారా కార్మిక హక్కుల పునరుద్ధరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యం పెరిగిందని తెలిపారు. ఆర్టీసీ కార్మిక సంఘాల చివరి గుర్తింపు ఎన్నికలు 2016 జూలై 19న జరిగాయని మంత్రి గుర్తు చేశారు. అనంతర కాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో కార్మిక సంఘాల కార్యకలాపాలు ప్రభావితమయ్యాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కార్మిక సంఘాలకు తగిన గౌరవం, ప్రజాస్వామ్య హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్మిక సంఘాల గుర్తింపు ప్రక్రియను పునరుద్ధరించడం ద్వారా కార్మికుల అభిప్రాయాలకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి వివరించారు. కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించడమే కాకుండా వారి హక్కులను కూడా పరిరక్షిస్తున్నామని చెప్పారు. గుర్తింపు సంఘాల ఎన్నికల ద్వారా కార్మికులు తమ ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం పొందనున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కార్మిక సంఘాల పాత్ర కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. గుర్తింపు సంఘాల ఎన్నికల అనంతరం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై తదుపరి చర్యలు ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. ఎన్నికల్లో గెలిచిన సంఘ ప్రతినిధులను అధికారుల కమిటీలో భాగస్వాములను చేసి విలీన ప్రక్రియపై చర్చలు జరుపుతామని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో ఎదురైన సమస్యలు తెలంగాణలో పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడే విధంగా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

ప్రభుత్వం చేపట్టిన కార్మిక సంక్షేమ చర్యలను కూడా మంత్రి వివరించారు. డీఏల చెల్లింపులు, ఫిట్‌మెంట్ అమలు, పీఎఫ్, సీసీఎస్ బకాయిల విడుదల, కారుణ్య నియామకాలు, తొలగించబడిన ఉద్యోగుల పునర్నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. ఉద్యోగ భారం తగ్గించేందుకు వేలాది ఉద్యోగాల భర్తీకి అనుమతులు ఇచ్చామని చెప్పారు. డ్రైవర్, శ్రామిక్ పోస్టుల నియామక ప్రక్రియ కూడా పూర్తయిందని వెల్లడించారు. ఆర్టీసీ బలోపేతం కోసం కొత్త బస్సుల కొనుగోలు, మహిళలకు యాజమాన్య అవకాశాలు, మహాలక్ష్మి పథకం అమలు వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. ఆర్టీసీ కార్మికులు ప్రజా రవాణా వ్యవస్థకు వెన్నెముకలాంటివారని పేర్కొన్నారు. వారి హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. కార్మికుల భాగస్వామ్యంతో ఆర్టీసీని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# పెళ్లైన 18 రోజులకే విషాదం

**యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని పల్లవి మృతి విషాదాన్ని మిగిల్చింది. ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న పల్లవి కళాశాల భవనం మూడో అంతస్తు నుంచి దూకిన ఘటన తీవ్ర కలకలం రేపింది. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన ఏనుగు మధుసూదన్ రెడ్డి కుమార్తె పల్లవికి ఈ ఏడాది ఆగస్టు 30న చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ రెడ్డితో వివాహం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివాహం జరిగిన కొద్ది రోజులకే కుటుంబంలో విభేదాలు తలెత్తినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పల్లవి కుటుంబ సభ్యుల ఆరోపణల ప్రకారం అదనపు వరకట్నం కోసం ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించినట్లు పేర్కొన్నారు. ఈ వేధింపులను తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైన పల్లవి తాను చదువుతున్న కళాశాల భవనం నుంచి దూకినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై పోలీసులు విచారణ చేపట్టారు. గాయపడిన పల్లవిని తొలుత జీడిమెట్లలోని నీలిమ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం మేడిపల్లిలోని శ్రీకర ఆసుపత్రికి మార్చి వైద్యం అందించారు. అయితే ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఘటనపై పల్లవి తల్లి సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలు సేకరిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది. యువతి మృతిపై కుటుంబ సభ్యులు, బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడవుతాయని పోలీసులు పేర్కొన్నారు.

# క్యూర్ పరిధిలో ఇళ్ల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాల కలెక్టర్లు, గృహనిర్మాణ, నీటి సరఫరా, విద్యుత్ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమై పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు గృహావసరం తీర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గతంలో ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మంత్రి తెలిపారు. ఎలాంటి రాజకీయ భేదాభిప్రాయాలకు తావివ్వకుండా ప్రజల ప్రయోజనాల దృష్ట్యా పనులు పూర్తి చేస్తున్నామని చెప్పారు. క్యూర్ పరిధిలోని 26 ప్రాంతాల్లో మొత్తం 21 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసినట్లు వెల్లడించారు. ఈ ఇళ్లను త్వరితగతిన అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పూర్తయిన ఇళ్లకు సంబంధించి ఈ నెల 30వ తేదీలోగా పారదర్శక విధానంలో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. డ్రా పద్ధతిలో ఎంపిక ప్రక్రియ నిర్వహించి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఉన్న ప్రాంతానికి ఐదు నుంచి ఏడు కిలోమీటర్ల పరిధిలో నివసించే అర్హులను ప్రాధాన్యంగా ఎంపిక చేయాలని చెప్పారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి వివాదాలు, అనుమానాలకు తావులేకుండా పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. డబుల్ బెడ్ రూమ్ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, అంతర్గత రహదారులు వంటి సదుపాయాలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నీటి సరఫరా, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ శాఖల మధ్య సమన్వయం పెంచి వచ్చే నెలాఖరులోగా అన్ని సదుపాయాలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు నివాసం ప్రారంభించిన తర్వాత ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే సమయంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివసించేందుకు అర్హత లేని వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ఇళ్లలో నివసించని వారికి తుది నోటీసులు జారీ చేసి, స్పందించని వారి కేటాయింపులను రద్దు చేయాలని సూచించారు. రద్దు చేసిన ఇళ్లను అర్హులైన ఇతర లబ్ధిదారులకు కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల అసలు ప్రయోజనం నిజమైన అర్హులకు చేరేలా కట్టుదిట్టమైన చర్యలు అవసరమని పేర్కొన్నారు. క్యూర్ పరిధిలో ఇంటి స్థలాలు కలిగి అర్హత సాధించిన దాదాపు 9 వేల మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఇన్‌చార్జి మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మంజూరు పత్రాలను త్వరితగతిన అందజేసి గృహనిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

# అసెంబ్లీ నిర్వహణపై వేములవిమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీని ప్రజా సమస్యల పరిష్కార వేదికగా కాకుండా రాజకీయ ఆరోపణల వేదికగా మార్చారని ఆయన ఆరోపించారు. ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే విపక్షాలపై అణచివేత ధోరణి అవలంబిస్తున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీలో ఇటీవల ఆమోదం పొందిన క్యూర్ బిల్లును ప్రస్తావిస్తూ, 463 పేజీల బిల్లును తక్కువ సమయంలో ఆమోదించడం సరైన విధానం కాదని ప్రశాంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కీలక చట్టాలపై సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా వ్యవహరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ ఆస్తులపై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై చేసిన భూకబ్జా ఆరోపణలు రుజువైతే తమ పదవులకు రాజీనామా చేసేందుకు సిద్ధమని, లేకపోతే ప్రభుత్వం కూడా అదే స్థాయిలో స్పందించాలని సవాల్ విసిరారు. ప్రభుత్వ భూవ్యవహారాలకు సంబంధించిన అంశాలపై ప్రజల దృష్టి మళ్లించేందుకు రాజకీయ మళ్లింపు వ్యూహాలు అమలు చేస్తున్నారని ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలు, పరిపాలనా చర్యలపై పారదర్శకత అవసరమని అన్నారు. ఈ అంశాలపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పార్టీ ఫిరాయింపుల అంశాన్ని కూడా ప్రస్తావించిన ఆయన, ఈ విషయంలో న్యాయస్థానాలు చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. రాజకీయ వ్యవస్థలో నైతిక విలువలు, ప్రజాస్వామ్య ప్రమాణాలు కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పాలకపక్షం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కూడా ప్రశాంత్ రెడ్డి తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అయితే ఆయన చేసిన ఆరోపణలు, వ్యాఖ్యలు రాజకీయ పరమైనవిగా ఉండగా, వాటిపై ప్రభుత్వం లేదా సంబంధిత నేతల స్పందన వెలువడాల్సి ఉంది. ఈ అంశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

# వరంగల్ విమానాశ్రయ కలకు కొత్త ఊపిరి

(మొదటి పేజీ తరువాయి)

ఇది కొత్త గుర్తింపుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. మామునూరు విమానాశ్రయం కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించి అవసరమైన భూమిని సేకరించింది. అనంతరం ఆ భూమిని భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థకు అప్పగించింది. దీంతో ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న విమానాశ్రయ కల క్షేత్రస్థాయిలో రూపుదిద్దుకుంటోందని ప్రభుత్వం వెల్లడించింది. ఈ విమానాశ్రయం కేవలం రవాణా సౌకర్యం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉపాధి అవకాశాలు, పెట్టుబడుల పెరుగుదలకు ప్రధాన ద్వారంగా మారనుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఉత్తర తెలంగాణ ప్రాంత అభివృద్ధికి ఇది కీలక మౌలిక వసతిగా నిలవనుందని పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి సమావేశమై ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన ప్రక్రియలను వేగవంతం చేయాలని కోరారు. దీనిపై సానుకూల స్పందన లభించగా, భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ అధికారులతో సమీక్ష కూడా నిర్వహించినట్లు సమాచారం. ప్రస్తుతం పర్యావరణ అనుమతుల ప్రక్రియ కొనసాగుతోంది. సంబంధిత పత్రాలను ఇప్పటికే సమర్పించిన నేపథ్యంలో అనుమతులు త్వరగా మంజూరైతే నిర్మాణ పనులు మరింత వేగంగా ముందుకు సాగే అవకాశం ఉంది. మామునూరు విమానాశ్రయం అందుబాటులోకి వస్తే వరంగల్‌తో పాటు ఉత్తర తెలంగాణ ప్రాంతానికి కొత్త అభివృద్ధి అధ్యాయం ప్రారంభమవుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# బీరం లక్ష్మారెడ్డికి ఘన నివాళులు

(మొదటి పేజీ తరువాయి)

సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్. రాజేందర్ రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కూడా నివాళుల కార్యక్రమంలో పాల్గొన్నారు. బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాయకులు అనంతరం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డిని పరామర్శించారు. కుటుంబం ఎదుర్కొంటున్న విషాద సమయంలో తమ మద్దతు ఉంటుందని భరోసా కల్పించారు. కుటుంబ సభ్యులను ఓదారుస్తూ ధైర్యం చెప్పారు. బీరం లక్ష్మారెడ్డి మరణం కుటుంబానికి, సన్నిహితులకు తీరని లోటని నాయకులు పేర్కొన్నారు.

# సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదు

(మొదటి పేజీ తరువాయి)

చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. హైకోర్టు తీర్పు అనంతరం తన వైఖరిని మరోసారి స్పష్టంగా వెల్లడించారు. దానం నాగేందర్ మాట్లాడుతూ హైకోర్టు తీర్పు స్పీకర్ నిర్ణయానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టుకు వెళ్లాలా వద్దా అన్నది పూర్తిగా స్పీకర్ పరిధిలోని విషయం అని తెలిపారు. తాను స్వయంగా ఎలాంటి న్యాయపరమైన చర్యలు చేపట్టే ఆలోచనలో లేనని స్పష్టం చేశారు. న్యాయ ప్రక్రియ తన దారిలో కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

అనర్హత వ్యవహారంపై హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో దీనిపై చర్చ మరింత వేగం అందుకుంది. వివిధ రాజకీయ పార్టీలు, న్యాయ నిపుణులు తీర్పు ప్రభావంపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ చేసిన ప్రకటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. భవిష్యత్తులో ఈ అంశం ఎలాంటి మలుపులు తిరుగుతుందనే దానిపై ఆసక్తి నెలకొంది. స్పీకర్ నిర్ణయమే తదుపరి న్యాయపరమైన ప్రక్రియలో కీలకంగా మారే అవకాశముందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలా వద్దా అన్న అంశంపై తుది నిర్ణయం స్పీకర్ తీసుకోవాల్సి ఉంటుందని దానం నాగేందర్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో తన పాత్ర పరిమితమేనని ఆయన సంకేతాలు ఇచ్చారు. న్యాయ వ్యవస్థపై తనకు పూర్తి గౌరవం ఉందని తెలిపారు.

రాజకీయ పార్టీ ఫిరాయింపులు, ప్రజాప్రతినిధుల అనర్హత వంటి అంశాలు ఇటీవలి కాలంలో రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశాలుగా మారాయి. హైకోర్టు తీర్పు కూడా ఇదే నేపథ్యంలో వెలువడింది. ఈ నిర్ణయం ఇతర ఇలాంటి కేసులపై కూడా ప్రభావం చూపే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. న్యాయపరమైన పరిణామాలను అన్ని వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. దానం నాగేందర్ తాజా వ్యాఖ్యలతో తన వైఖరి స్పష్టమైందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సుప్రీంకోర్టుకు వెళ్లే అంశాన్ని స్పీకర్ నిర్ణయానికే వదిలేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్న దానిపై రాజకీయ, న్యాయ వర్గాల్లో ఆసక్తి కొనసాగుతోంది. ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరికొంతకాలం చర్చకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పట్టభద్రుల ఓటరు నమోదుకు షెడ్యూల్

- **నవంబర్ 6 వరకు దరఖాస్తుల గడువు**

**నిర్మల్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు)** శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితా పునఃసిద్ధీకరణ ప్రక్రియకు ఎన్నికల అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. అర్హత కలిగిన పట్టభద్రులు తప్పనిసరిగా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సూచించారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే నిర్దేశిత గడువులోగా దరఖాస్తు సమర్పించడం అవసరమని తెలిపారు. ఈ ప్రక్రియ ఎన్నికల నిర్వహణలో కీలక దశగా అధికారులు పేర్కొన్నారు. పట్టభద్రుల ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడానికి అర్హులైన అభ్యర్థులు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించవచ్చని వివరించారు. దరఖాస్తు చేసుకునే సమయంలో అవసరమైన విద్యార్హత ధ్రువపత్రాలు, ఇతర ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అన్ని వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.

ఓటరు జాబితాలో పేరు నమోదు కోసం దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 6, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు కలెక్టర్ వెల్లడించారు. గడువు ముగిసిన తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. అందువల్ల అర్హత కలిగిన పట్టభద్రులు చివరి తేదీ కోసం ఎదురుచూడకుండా ముందుగానే దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవడం ద్వారా ఎన్నికల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన ఎన్నికలుగా పరిగణించబడతాయని అధికారులు తెలిపారు. సాధారణ ఓటరు జాబితాలో పేరు ఉండటం మాత్రమే సరిపోదని, ప్రత్యేకంగా పట్టభద్రుల ఓటరు జాబితాలో నమోదు కావాల్సి ఉంటుందని వివరించారు. అర్హత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. జిల్లా యంత్రాంగం ఈ నమోదు ప్రక్రియపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుందని అధికారులు తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# చిల్పూర్ గుట్టపై వైభవంగా బుగులు వెంకన్న కల్యాణం



**చిల్పూర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** జనగామ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశ్రీశ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి దేవస్థానం చిల్పూర్ గుట్టలో శనివారం స్వామివారి వార కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది.ఉదయం నుంచే ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత బుగులు వేంకటేశ్వర స్వామివారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని తిలకించి తరించారు. కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తులు విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ధర్మకర్త మండలి సభ్యులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బి. లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ముఖ్య అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, అర్చకులు సౌమిత్రి శ్రీరంగాచార్యులు, ఆదిత్యాచార్యుల కృష్ణమాచార్యులు స్వామివారి కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలి

- **మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్**




**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘన్‌పూర్ పురపాలక అభివృద్ధికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణ పారిశుద్ధ్యంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా డబ్బాల్లో సేకరించాలని కోరారు. చెత్త సేకరణ వాహనాలు, ట్రాలీలు వచ్చినప్పుడు వాటిలోనే చెత్త వేయాలని సూచించారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో 43 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారని, సిబ్బంది కొరత కారణంగా కొంతమేర ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. మరో 30 మంది సిబ్బంది అవసరం ఉందన్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

మున్సిపాలిటీలో సిబ్బంది కొరత దృష్ట్యా ప్రజలు ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగాన్ని తగ్గించాలని తాటికొండ వినయ్ కుమార్ కోరారు. పట్టణ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు 4 స్వచ్ఛ ఆటోలు, 2 ట్రాక్టర్లు, ఒక జేసీబీ కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 3 ట్రాక్టర్లు, 2 ఆటోలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.ప్రస్తుత పరిస్థితిని ప్రజలు అర్థం చేసుకుని మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. మున్సిపల్ కార్యాలయంలో త్వరలో పౌర సేవల వివరాల పట్టికను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కొంతమంది చెత్త సేకరణ వాహనం రాకపోతే మురుగు కాలువల్లో చెత్త వేస్తున్నారని, దీనివల్ల పారిశుద్ధ్య సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ప్రజలు చెత్తను డబ్బాల్లో సేకరించి, చెత్త సేకరణ వాహనం వచ్చినప్పుడు అందులోనే వేయాలని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

# వినాయక నిమజ్జనంపై పోలీసుల సూచనలు

- **డీజేలకు అనుమతి లేదు**
- **ముల్కనూర్ఎస్ఐ.రాజు**




**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 19తెలంగాణ ముచ్చట్లు):**వినాయక నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని పోలీసులు సూచించారు. నిమజ్జన ఊరేగింపులో డీజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్‌లను వినియోగించరాదని స్పష్టం చేశారు.

ఉత్సవ కమిటీ నిర్వాహకులు నిమజ్జనానికి ముందుగానే పోలీసులకు సహకరించి, సూచించిన మార్గాల్లోనే ఊరేగింపు నిర్వహించాలని తెలిపారు. నిమజ్జన మార్గంలో ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అదేవిధంగా ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని, పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండి, భక్తిశ్రద్ధలు, సోదరభావంతో వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# రేవల్లిలో ఘనంగా మండల స్థాయి క్రీడా పోటీలు



**రేవల్లి,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రేవల్లి క్రీడా ప్రాంగణంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఉదయం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో రేవల్లి గ్రామ సర్పంచ్ రాజయ్య, ఎంపీడీఓ కీర్తన, మండల విద్యాధికారి ఎస్. వరప్రసాద్ రావు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పి. ప్రసాద్, జిల్లా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు రామమూర్తి పాల్గొని పోటీలను ప్రారంభించారు. మండలంలోని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పోటీల నిర్వహణలో పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి కుమార్, ఎంపీడీఓ కీర్తన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతలు: కబడ్డీ బాలికల్లో కేజీబీవీ రేవల్లి ప్రథమ, జడ్పీహెచ్ఎస్ రేవల్లి ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. కబడ్డీ బాలుర విభాగంలో జడ్పీహెచ్ఎస్ రేవల్లి ప్రథమ, జడ్పీహెచ్ఎస్ నాగపూర్ ద్వితీయ స్థానాలు సాధించాయి. ఖో ఖో బాలికల్లో జడ్పీహెచ్ఎస్ నాగపూర్ ప్రథమ, జడ్పీహెచ్ఎస్ రేవల్లి ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ఖో ఖో బాలుర విభాగంలో జడ్పీహెచ్ఎస్ నాగపూర్ ప్రథమ, జడ్పీహెచ్ఎస్ తలుపునూరు ద్వితీయ స్థానాలు సాధించాయి. వాలీబాల్ బాలుర విభాగంలో జడ్పీహెచ్ఎస్ రేవల్లి ప్రథమ, జడ్పీహెచ్ఎస్ తలుపునూరు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

# బొజ్జ గణపయ్యకే వలలు - కోతుల బెడదతో వింత పరిస్థితి



కోతుల బెడదకు గణనాథుడికి చిల్పూర్ లో వల ఏర్పాటు చేసిన నిర్వాహకులు



గడ్డం హరికృష్ణ



ఒగ్గు రాజు



రాజారపు రంజిత్

- **భక్తితో పూజించాల్సిన పరిస్థితి నుండి.. బంధించి కాపాడాల్సిన దుస్థితి**
- **ప్రసాదాలు ఎత్తుకెళ్లకుండా... నిర్వాహకుల వినూత్న ఆలోచన**

**చిల్పూర్,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా వినాయక మండపాలకు వింత సమస్య ఎదురైంది. కోతుల బెడదతో భక్తులు, కమిటీ నిర్వాహకులు గణనాథుడి చుట్టూ ఇనుప వలలు, నెట్లు ఏర్పాటు చేస్తున్నారు. దండలు, పండ్లు, లడ్డూ, ప్రసాదం, కొబ్బరికాయలు కోతులు ఎత్తుకెళ్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్న వేళ, స్టేషన్ ఘనపూర్ తో పాటు చిల్పూర్, జాఫర్ ఘడ్, లింగాల గణపురం మండలంలోని ని పలు గ్రామాల్లో కోతుల సంచారం ఎక్కువగా ఉంది. గుట్టలకు దగ్గరగా ఉన్న గ్రామాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. నియోజకవర్గ వ్యాప్తంగా 200కు పైగా మండపాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. భక్తితో పూజించాల్సిన గణనాథుడిని వలల్లో బంధించి కాపాడుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కోతులను అడవుల్లోకి తరలించాలని కోరుతున్నారు. మండపం చుట్టూ పక్కల వలలు కట్టి, భక్తులు దర్శనం చేసుకునేందుకు చిన్నద్వారం ఏర్పాటు చేశారు. దీంతో కోతులు లోపలికి రాకుండా విగ్రహానికి ఎలాంటి నష్టం జరగకుండా కాపాడుతున్నారు. కమిటీ సభ్యుల ఈ ఆలోచనలకు భక్తులు వర్షం వ్యక్తం చేస్తున్నారు. "ప్రతి ఏటా కోతుల వల్ల అలంకరణ పాడవుతుండేది. ఈసారి వాళ్ళని వల్ల ప్రశాంతంగా పూజలు చేసుకోగలుగుతున్నాం" అని గ్రామస్తులు తెలిపారు. వినాయక ఉత్సవాలు ఇలాంటి చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఉత్సవాలు ప్రశాంతంగా, ఇలాంటి ఆటంకాలు లేకుండా జరుగుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**మండపం నిర్వాహకుడు**
**గడ్డం హరికృష్ణ, చిల్పూర్ గుట్ట**

"మేము 9 అడుగుల గణపతిని తెచ్చాం. మా గ్రామంలో కోతుల గుంపులు గుంపులుగా వచ్చి ఎవరి చేతిలో ఏది ఉన్నా లాక్కొని వెళ్తాయి, దీంతో ప్రతి యేట వినాయక మండపానికి కోతుల బెడద వల్ల వలలు ఏర్పాటు చేస్తూనే ఉన్నాము. వల ఏర్పాటు చేయకోతే కోతుల గుంపు వచ్చి పూల దండలు కింద పడేసి చిందరవందర చేసేవి, అందుకే డబ్బులువెచ్చించి మండపం చుట్టూ వల(నెట్) వేశాం. ఇప్పుడు భక్తులు వల లోపలికి వచ్చి దర్శనం చేసుకుంటున్నారు."

**భక్తుడు - ఒగ్గు రాజు**
**పాముసూరు (స్టేషన్ ఘనపూర్)**

"పిల్లలతో హారతి ఇద్దామని వస్తే కోతులు మీద పడుతున్నాయి. పోయిన ఏడాది నా చేతిలో ఉన్న పులిహోర ప్యాకెట్ లాక్కెళ్లింది. ఇప్పుడు వలలు వేశాక కాస్త ధైర్యంగా పూజకు వస్తున్నాం, కానీ గణపయ్యకు వలలు కట్టడం మాత్రం బాధగా ఉంది." కానీ కోతుల బెడద వల్ల తప్పడం లేదు...

**రంగు రవి గౌడ్, రైతు రాజవరం(చిల్పూర్):**

"కోతుల బెడద పొలాల్లోనే కాదు, ఇప్పుడు దేవుడి మండపాల దాకా వచ్చింది. పండగ 11 రోజులు ఉంటది, అన్ని రోజులు ఇలా వలల్లో గణపతిని ఉంచడం బాధాకరం. ప్రభుత్వం కోతుల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలి." ప్రభుత్వం కోతులను బంధించి అడవుల్లో వదిలిపెట్టాలని గ్రామస్థులు, భక్తులు అధికారులను కోరుతున్నారు.

# రత్నతండాకు రోడ్డు సౌకర్యం కల్పించాలి



**చిల్పూర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని లింగంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రత్నతండాకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం బృందం రత్నతండాను సందర్శించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకుంది.సుమారు 80 ఏళ్ల క్రితం ఏర్పడిన రత్నతండాలో 13 కుటుంబాలకు చెందిన 60 మంది నివసిస్తున్నారని రాపర్తి రాజు తెలిపారు. తండాకు సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు సౌకర్యం లేకపోవడంతో విద్య, వైద్యం కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తండాలో రేషన్ దుకాణం, అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆశా కార్యకర్తలు కూడా సక్రమంగా అందుబాటులో ఉండటం లేదని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి తండాకు రోడ్డు నిర్మించడంతో పాటు అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్, ఆవుల ప్రభాకర్, అపారదాపు రాజు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సౌకర్యాల మెరుగుదలకు చర్యలు

- **పైప్‌లైన్ పనులు ప్రారంభించిన వంగరసర్పంచ్**



**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** వంగర గ్రామంలో ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు చేపట్టిన నూతన పైప్‌లైన్ పనులను గ్రామ సర్పంచ్ గజ్జెల సృజన రమేష్ ప్రారంభించారు.రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిధుల ద్వారా మంజూరైన రూ. రెండు లక్షలతో నూతన పైప్‌లైన్ పనులను చేపట్టడం జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ఈ నూతన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధికి అందుతున్న నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తూ, గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వీరన్న నాయక్, వార్డు మెంబర్లు రామారావు, స్వరూప, మారం సతీష్, గజ్జల రమేష్, బత్తిని అశోక్, కాల్వ సంపత్, రామవరపు మైసయ్య పాల్గొన్నారు.

# జవహర్ నగర్ మల్కారంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం



**జవహర్ నగర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జవహర్ నగర్ మల్కారం ప్రాంతంలో పీవీఎం రమేష్, పీవీఎం జగ్గా, పీవీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు, కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ నూరుద్దీన్ ఫారూఖ్ బాయ్‌ను ఆహ్వానించారు. ముఖ్య అతిథులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు, స్థానికులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రైస్తవ అనే మత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండాలనే సందేశంతో ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్నదానం చేయడం ఎంతో గొప్ప విషయమని పానుగంటి బాబు, మహమ్మద్ నూరుద్దీన్ ఫారూఖ్ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సోహెల్, పానుగంటి బాబు మాజీ కార్పొరేటర్‌తో పాటు పలువురు స్థానికులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# భయాన్ని కాదు.. భరోసాను ఇవ్వాలి

- వంగర గురుకులంలో విద్యార్థుల భద్రతపై ఆందోళన
- ప్రిన్సిపాల్, సిబ్బందిపై నిష్పక్షపాత విచారణ జరపాలి: బీజేపీ జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్



**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు):** వంగరలోని డాక్టర్ పి.వి. నర్సింహారావు బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థుల భద్రత, మానసిక స్థితిపై సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. విద్యార్థులకు భరోసా కల్పించాల్సిన గురుకుల యాజమాన్యం, వారిలో మరింత ఆందోళన కలిగించేలా వ్యవహరించడం సరికాదని అన్నారు.

విద్యార్థిని చదువుకు ఆటంకం కలిగించారనే ఆరోపణలు

భీమదేవరపల్లి మండలం వంగరలోని గురుకులంలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అక్క ఆత్మహత్య చేసుకున్న అనంతరం అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వచ్చిన విద్యార్థినిని పాఠశాలలో కొనసాగించేందుకు ప్రిన్సిపాల్ నిరాకరించారనే ఆరోపణలు వచ్చాయని పృథ్విరాజ్ గౌడ్ తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ తీరుపై చేసిన ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.

గత ఘటనలపై కూడా విచారణ అవసరం

ఇదే గురుకులంలో గతంలో పదో తరగతి విద్యార్థిని శ్రీవర్షిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనను ఆయన ప్రస్తావించారు. ఆ సమయంలోనూ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల వేధింపులపై తల్లిదండ్రులు ఆరోపణలు చేశారని తెలిపారు. ఇటీవల గట్లనర్సింగపూర్‌కు చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం ఉందని, అనంతరం ఆమెకు టీసీ ఇచ్చి పంపించారనే ఆరోపణలు ఉన్నాయని అన్నారు.

ప్రిన్సిపాల్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనల నేపథ్యంలో గురుకులంలో విద్యార్థుల భద్రత, మానసిక ఆరోగ్యం, పర్యవేక్షణ వ్యవస్థపై సమగ్ర విచారణ జరపాలని పృథ్విరాజ్ గౌడ్ కోరారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రిన్సిపాల్, సిబ్బందిపై విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ సహా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


సిబ్బందిని మార్చాలని డిమాండ్

ప్రస్తుత సిబ్బందిని బదిలీ చేసి, కొత్త సిబ్బందిని నియమించాలని ఆయన కోరారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని అన్నారు.

గురుకులాల్లో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి

రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో విద్యార్థుల భద్రత, మానసిక ఆరోగ్యం, ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పృథ్విరాజ్ గౌడ్ కోరారు. గురుకులాలు విద్యార్థుల్లో భయాన్ని కాకుండా భవిష్యత్తుపై భరోసాను కల్పించే వాతావరణాన్ని అందించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# జవహర్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం



- స్మైల్ ఫౌండేషన్ సహకారంతో యూనివర్సల్ హ్యుమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ

**జవహర్‌నగర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని జవహర్‌నగర్ డివిజన్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్మైల్ ఫౌండేషన్ సహకారంతో యూనివర్సల్ హ్యుమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీజేఆర్ నగర్ మామిడి తోటలో శనివారం ఉదయం 10.30 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమైంది.ఈ శిబిరంలో జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, చిన్నారుల వైద్య నిపుణులు అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ అనారోగ్య సమస్యలు, కీళ్ల నొప్పులు, ఎముకలకు సంబంధించిన సమస్యలు, చిన్నారుల ఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్యులు అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. వైద్య ఖర్చులు భరించలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఇలాంటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు.శిబిరం విజయవంతానికి జవహర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు సమయానికి హాజరై సహకరించాలని డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.కార్యక్రమ ఏర్పాట్లలో యూనివర్సల్ హ్యుమానిటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కొలిపాక సాయికిరణ్, కొలిపాక కళ్యాణి పాల్గొని శిబిర నిర్వహణకు అవసరమైన సమన్వయం చేశారు. శిబిరంలో స్మైల్ ఫౌండేషన్ సీహెచ్ఓ ఎండీ సాదిక్‌తో పాటు వైద్యులు గడ్డం రాజకుమార్, జె.గౌతమీ, మెడ శిరీష, స్టాఫ్ నర్సులు సంధ్యారాణి, సిమియా, మానస రాజశేఖర్, పవిత్ర తదితరులు వైద్య సేవలు అందించారు.

# పిడుగుపాటుకు రైతు మృతి

- లచ్చన్నగూడెంలో విషాదం.. కుటుంబానికి పెద్దదిక్కు దూరం.
- ముగ్గురు కుమార్తెలకు వివాహాలు కాకముందే విషాదం.. ఆదుకోవాలని గ్రామస్థుల విజ్ఞప్తి.

**వేంసూరు, సెప్టెంబరు 19 (తెలంగాణ ముచ్చట్లు):** పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న రైతు పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఘటన వేంసూరు మండలం లచ్చన్నగూడెంలో విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన పర్స ఆనందరావు (52), అంజయ్య కుమారుడు, వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లాడు. దుక్కి దున్నుతున్న సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపుల మధ్య ఒక్కసారిగా పిడుగు పడటంతో ఆనందరావు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే ఆనందరావును సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఆనందరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురు కుమార్తెలకు ఇంకా వివాహాలు జరగలేదు. కుటుంబాన్ని పోషిస్తూ పెద్దదిక్కుగా ఉన్న ఆనందరావు ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. తండ్రి మృతితో కుమార్తెల రోదనలు మిన్నంటాయి. ఆనందరావు మృతితో లచ్చన్నగూడెంలో విషాదం నెలకొంది. బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



# జీవో 97 రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థినుల నిరసన

- పాలిటెక్నిక్ కళాశాలలను 'శక్తి స్కీం'లో విలీనం చేయొద్దని డిమాండ్

**కరీంనగర్, సెప్టెంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులు తరగతులను బహిష్కరించి నిరసనకు దిగారు. జీవో 97ను రద్దు చేయాలని, పాలిటెక్నిక్ కళాశాలలను 'శక్తి స్కీం'లో కలపవద్దని, వాటిని టెక్నికల్ ఎడ్యుకేషన్ బోర్డు పరిధిలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు కళాశాల ఆవరణలో నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు.

పాలిటెక్నిక్ విద్యకు సంబంధించిన పరిపాలన, విద్యా వ్యవస్థను యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని జీవో 97ను ఉపసంహరించుకోవాలని విద్యార్థినులు విజ్ఞప్తి చేశారు.



# నిరుపేద MBBS విద్యార్థినికి అండగా డా. కవ్వంపల్లి

- రూ.1.29 లక్షల చెక్కు అందజేత
- పుస్తకాల బాధ్యత కూడా నాదేనని హామీ

**కరీంనగర్, సెప్టెంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు ):** ఆర్థిక ఇబ్బందులతో వైద్య విద్యను కొనసాగిస్తున్న నిరుపేద విద్యార్థిని వడ్డేపల్లి రహేల్‌కు టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అండగా నిలిచింది. వరంగల్ జిల్లా చెన్నారెడ్డిపల్లి లేబర్ కాలనీకి చెందిన రహేల్ ప్రస్తుతం ఎంబీబీఎస్ విద్యను అభ్యసిస్తోంది.



కుటుంబ సభ్యుల విజ్ఞప్తికి స్పందించిన మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ రూ.1,29,500 విలువైన చెక్కును విద్యార్థినికి అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదన్నారు. రహేల్ ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఎంబీబీఎస్ పూర్తి చేసి మంచి వైద్యురాలిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆమె చదువుకు తన వంతు సహాయం కొనసాగిస్తానని, పూర్తి విద్యకు అవసరమైన పుస్తకాల బాధ్యతను కూడా తానే స్వీకరిస్తానని హామీ ఇచ్చారు.విద్యార్థిని భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ ఆర్థిక సహాయంతో పాటు పుస్తకాల బాధ్యతను స్వీకరించిన డా. కవ్వంపల్లి సత్యనారాయణకు రహేల్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# గణనాథుని పూజలో పాల్గొన్న పలుస శంకర్ గౌడ్



**శ్రీరంగాపూర్,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** వినాయక చవితిని పురస్కరించుకుని వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, మాజీ ఎంపీపీ పృథ్వీరాజ్ హాజరై గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుని కృపతో శ్రీరంగాపూర్ మండల ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.మాజీ ఎంపీపీ పృథ్వీరాజ్ మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రజలు ఐకమత్యంతో, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా వినాయక ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉత్సవాలు భక్తి, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.అనంతరం గణనాథుని దర్శించుకుని భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ధంజయ్ రాజ్, వెంకట్రామ్ రాజ్, యువకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులకు పలుస శంకర్ గౌడ్ అభినందనలు తెలిపారు.

# అమ్మ పేరుతో మొక్క.. భావితరాలకు పచ్చని కానుక

- 'ఏక్ పేడ్ మా కే నామ్'లో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన.



**సత్తుపల్లి, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** అమ్మ పేరుతో మొక్కను నాటి.. దాన్ని సంరక్షించడం ద్వారా తల్లిపై ఉన్న ప్రేమను చాటడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ నర్సింహ, మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా శనివారం విశ్వశాంతి విద్యాలయంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. తల్లి ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీకగా ఆమె పేరుతో నాటిన మొక్కను భావించాలని సూచించారు. మొక్కను నాటి వదిలేయకుండా.. క్రమం తప్పకుండా నీరు పోస్తూ, సంరక్షించి వృక్షంగా తీర్చిదిద్దాలన్నారు. నేడు నాటిన మొక్క రేపటి తరాలకు నీడను, స్వచ్ఛమైన గాలిని అందించే పచ్చని కానుకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఒక మొక్కను నాటితే.. పచ్చదనం పెంపుతో పాటు ప్రకృతిపై బాధ్యత కూడా పెరుగుతుందని తెలిపారు. అమ్మను ఎంతగా ప్రేమిస్తామో.. ప్రకృతిని కూడా అంతే ప్రేమతో కాపాడాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు విద్యార్థులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. 'నా అమ్మను ఎంతగా ప్రేమిస్తానో.. ప్రకృతిని కూడా అంతే ప్రేమిస్తాను. నా అమ్మ పేరుతో నాటిన ఈ మొక్కను జాగ్రత్తగా పెంచుతాను. నీటిని వృథా చేయను. చెట్లను కాపాడుతాను. పచ్చదనాన్ని పెంచుతాను. ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం నా వంతు బాధ్యతను నిర్వర్తిస్తాను' అంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. అమ్మ పేరుతో నాటిన మొక్కను ప్రేమతో పెంచడం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెంపొందుతుందన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి.. దాని సంరక్షణను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం తరఫున సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 500 మంది విద్యార్థులు.. సమావేశానికి 25 మంది తల్లిదండ్రులే

- పిల్లల విద్యా ప్రగతిపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి.:తాటి వెంకటేశ్వర్లు.



**దమ్మపేట, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** పిల్లల విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాలలో హెడ్‌మాస్టర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పేరెంట్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతి నెల మూడో శనివారం పేరెంట్స్ సమావేశం నిర్వహించడం అభినందనీయమన్నారు. పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులు చదువుతున్నప్పటికీ.. సమావేశానికి కేవలం 25 మంది తల్లిదండ్రులు మాత్రమే హాజరుకావడం బాధాకరమన్నారు. తమ పిల్లలు పాఠశాలలో ఎలా చదువుతున్నారు.. వారి విద్యా ప్రగతి ఎలా ఉంది.. చదువులో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అనే విషయాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తాటి అన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించి వాటిని వెలికితీసేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని తెలిపారు. అదే సమయంలో తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చి ఉపాధ్యాయులతో మాట్లాడాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక మొత్తంలో ఖర్చు చేసి పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులు.. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందుతున్న విషయాన్ని గుర్తించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. పిల్లల చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత వంటి అంశాలపై కూడా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తాటి సూచించారు. ప్రతి నెల నిర్వహించే పేరెంట్స్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరై తమ పిల్లల విద్యా ప్రగతిని తెలుసుకోవాలని కోరారు. పాఠశాల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసినప్పుడే విద్యార్థుల భవిష్యత్తుకు మరింత మెరుగైన పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు అధిక నిధులు కేటాయించాలి

- **బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలి**
- **16 ఏళ్లలోపు పిల్లలకు సెల్‌ఫోన్ వినియోగంపై చట్టం చేయాలి: వలస సుభాష్ చంద్రబోస్**

**హుజురాబాద్, సెప్టెంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ కోరారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రభుత్వ శాఖలు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

హుజురాబాద్ పట్టణ కేంద్రంలో శనివారం విలేకరులకు ప్రకటన విడుదల చేసిన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బాల కార్మికులు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. బాల్యం ఎంతో విలువైనదని, పిల్లలకు నాణ్యమైన విద్య అందించినప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

16 ఏళ్లలోపు పిల్లలకు సెల్‌ఫోన్, సామాజిక మాధ్యమాల వినియోగాన్ని నియంత్రించే విధంగా రాష్ట్ర శాసనసభలో చట్టం చేయాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డిని బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర కమిటీ తరపున కోరుతున్నట్లు తెలిపారు. బాలల హక్కులను ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

బాలలతో ఎవరైనా పనులు చేయిస్తే వెంటనే 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు విద్యా హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాల కార్మికులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చేర్పించేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని కోరారు.



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ముఖ్యంగా ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సుభాష్ చంద్రబోస్ అన్నారు. ప్రతి పౌరుడు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కూడా సమాజంలోని అన్ని వర్గాలు కంకణబద్ధులు కావాలని అన్నారు. బాలల హక్కుల ప్రజా వేదిక గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రవ్యాప్తంగా బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణ కోసం కృషి చేస్తోందని తెలిపారు.

సెప్టెంబర్ 20 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 16 ఏళ్లలోపు పిల్లలకు సెల్‌ఫోన్, సామాజిక మాధ్యమాల వినియోగాన్ని నియంత్రించే చట్టం తీసుకురావాలని కోరుతూ సమావేశాల్లో చర్చిస్తామని తెలిపారు. బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు దుప్పట్లు, దోమతెరలు అందించడంతో పాటు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకు ఐక్య పోరాటమే శరణ్యం

- **28న అశ్వారావుపేటలో టీజేఎంయూ ప్రథమ మహాసభ.. కరపత్రాలు ఆవిష్కరణ.**

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం కలమెత్తి పోరాడే జర్నలిస్టులు.. నేడు తమ హక్కులు, వృత్తి భద్రత కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఉదయరాఘవేంద్ర అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 28న ఉదయం 11 గంటలకు అశ్వారావుపేటలోని కెమిలాయిడ్స్ గెస్ట్‌హౌస్‌లో టీజేఎంయూ నియోజకవర్గ ప్రథమ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభకు యూనియన్ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షుడు ఇనపనూరి ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్‌యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన ప్రచార కరపత్రాలను శనివారం యూనియన్ నాయకులు, సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. సమాజ రక్షణలో ముందుండే జర్నలిస్టులకు వృత్తి భద్రత, ఆరోగ్య రక్షణ కొరవడుతున్నాయని ఉదయ రాఘవేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. సొంత ఇళ్లు లేక పలువురు పాత్రికేయులు అద్దె ఇళ్లలోనే జీవనం సాగిస్తున్నారని తెలిపారు.



వార్తా సేకరణలో ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న విలేకరులపై బెదిరింపులు, అక్రమ కేసులు నమోదవుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, రక్షణ కోసం సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజకీయ, వ్యక్తిగత భేదాలను పక్కనపెట్టి వర్కింగ్ జర్నలిస్టులంతా హక్కుల సాధన కోసం ఏకతాటిపైకి రావాలని ఉదయరాఘవేంద్ర పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యలను వారి గొంతుకతోనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 28న నిర్వహించే మహాసభ ఇందుకు వేదికగా నిలుస్తుందని తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులంతా మహాసభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నూనె హనుమంతరావు, పెనుగొండ సత్యనారాయణ, నార్లపాటి సుబ్బారావు, బి.రాము, మద్దు రవికుమార్, దాది చంటి, ముల్లగిరి రమేష్, ముళ్లగిరి విజయ్, రాయల పోలయ్య, సలార్, గణేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులు, స్థానిక జర్నలిస్టులు పాల్గొన్నారు.

# చింతకాని పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

- **సాంకేతిక పరిజ్ఞానంతో కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి**
- **సీపీ సునీల్ దత్**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు ):** కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ, పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం చింతకాని పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

కేసులకు సంబంధించిన వివరాలను సీసీటీఎన్ఎస్ లో ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో నమోదు చేసి అప్‌డేట్ చేయాలని సూచించారు. దర్యాప్తులో ఈసాక్ష్యను సమర్థవంతంగా వినియోగిస్తూ ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో భద్రపరచాలని తెలిపారు. నాట్‌గ్రిడ్ టీజీకాప్ వంటి సాంకేతిక వేదికలను దర్యాప్తులో సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు.



భూ వివాదాలకు సంబంధించిన కేసుల్లో నిర్దేశిత మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని, చట్టపరమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సీపీ పేర్కొన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై నిరంతరం నిఘా కొనసాగించాలని ఆదేశించారు. విద్యార్థులు, యువత, ప్రజలకు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలని, ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ, యూపీఐ మోసాలు, నకిలీ లింకులు, డిజిటల్ అరెస్టులపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన పూర్తి చేసి, కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి కేసులో దర్యాప్తు నాణ్యత, ఆధారాల సేకరణ, కేసు నమోదు, పత్రాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే స్వీకరించి, వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటూ మెరుగైన పోలీసింగ్ సేవలు అందించాలని సీపీ సునీల్ దత్ ఆదేశించారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, నేరస్తులపై నిఘా, ప్రజలకు భద్రత కల్పించే విషయంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# రైతుల ఆందోళనలపై కేటీఆర్ విమర్శలు



- **రేవంత్ సొంత గ్రామంలోనే విద్యుత్ సమస్యలు**
- **ఎల్‌నినో కారణమన్న ప్రభుత్వ వాదన**
- **రైతుల కష్టాలపై రాజకీయ దుమారం**
- **ప్రతిపక్షం నుంచి తీవ్ర ఆరోపణలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు)** రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ సరఫరా అంశం మరోసారి రాజకీయ చర్చకు దారితీసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం పరిసర ప్రాంతాల్లో రైతులు విద్యుత్ సమస్యలపై ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రైతులకు సరిపడా కరెంటు అందడం లేదని ప్రజలు రోడ్డెక్కుతున్న పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ సమస్యలకు ఎల్‌నినో ప్రభావమే ప్రధాన కారణమని చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తప్పుబట్టారు. ఎల్‌నినోను కారణంగా చూపడం ద్వారా ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. విద్యుత్ నిర్వహణలో లోపాలే ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు కారణమని ఆయన వ్యాఖ్యానించారు.

వ్యవసాయ పనులు కీలక దశలో ఉన్న సమయంలో విద్యుత్ అంతరాయాలు రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. పంటలకు నీరందించేందుకు రైతులు రాత్రింబవళ్లు మోటార్ల వద్ద కాపలా కాయాల్సిన పరిస్థితి నెలకొన్నదని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ వోల్టేజ్, అనియమిత సరఫరా వంటి సమస్యలు కొనసాగుతున్నాయని విమర్శించారు. మరోవైపు ప్రభుత్వం మాత్రం విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడం, వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల వినియోగం అధికం కావడం వంటి కారణాల వల్ల ఒత్తిడి ఏర్పడిందని చెబుతోంది. ఎల్‌నినో ప్రభావంతో సాధారణ పరిస్థితులు మారిపోయాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం వివరిస్తోంది.

విద్యుత్ సమస్యలపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. రైతుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా పరిష్కరించాలని పలు రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి. వ్యవసాయ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కీలకమైన నేపథ్యంలో విద్యుత్ సరఫరా అంశం ప్రాధాన్యత సంతరించుకుంది. రైతులకు నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, అదే సమయంలో సమస్యల మూలాలను పారదర్శకంగా వెల్లడించాలని రైతులు కోరుతున్నారు. ఈ అంశం రానున్న రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చనీయాంశంగా మారే అవకాశం కనిపిస్తోంది.

# మహా గణనాధుని దర్శించిన బీసీ జేఏసీ నాయకులు



- **వివేకానంద కాలనీలో ఘనంగా వినాయక ఉత్సవాలు**

**హుజురాబాద్, సెప్టెంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణంలోని 21వ వార్డు వివేకానంద కాలనీలో గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన మహా గణనాధుని బీసీ జేఏసీ నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షులు సందేల వెంకన్న మాట్లాడుతూ గణేష్ యూత్ అసోసియేషన్ సభ్యులు తమను దర్శనానికి ఆహ్వానించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న సభ్యులను అభినందించారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి
వినాయకుని అనుగ్రహంతో వివేకానంద కాలనీ వాసులతో పాటు హుజురాబాద్ పట్టణ ప్రజలందరూ ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయాలతో ముందుకు సాగాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ఐకమత్యంతో ముందుకు సాగాలి
ప్రజలందరూ భక్తిభావంతో మెలిగి, అందరి ఆనందాన్ని తమ ఆనందంగా భావిస్తూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని కోరారు. వినాయకుని కృపాకటాక్షాలకు అందరూ పాత్రులు కావాలని ఆకాంక్షించారు.

ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించాలి
గణేష్ యూత్ అసోసియేషన్ సభ్యులు ప్రతి సంవత్సరం వినాయక ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు వన్నాల శివాజీ, బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, ఉపాధ్యక్షులు మామునూరి ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి కుమార్, తిరునహరి రమేష్ తదితరులు పాల్గొని గణనాధునికి పూజలు నిర్వహించి ఉత్సవ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# అంబేద్కర్‌ను అవమానిస్తే సహించం

- **ఎర్రోళ్ల సదానందం తీవ్ర ఆగ్రహం**

**హుజురాబాద్, సెప్టెంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు ):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ చేసినట్లు ఆరోపణలు వస్తున్న వ్యాఖ్యలపై ఎర్రోళ్ల సదానందం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్‌ను 'కల్పిత నాయకుడు'గా పేర్కొనడం దారుణమని, ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఎర్రోళ్ల సదానందం మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దేశానికి రాజ్యాంగాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడని తెలిపారు. సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడి, సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేసిన అంబేద్కర్‌ను కించపరిచేలా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. అంబేద్కర్ గురించి మాట్లాడే ముందు ఆయన దేశానికి చేసిన సేవలను, సామాజిక న్యాయం కోసం సాగించిన పోరాటాన్ని తెలుసుకోవాలని సదానందం సూచించారు. రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించడంలో అంబేద్కర్ చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.



అంబేద్కర్‌ను 'కల్పిత నాయకుడు' అని వ్యాఖ్యానించడం కోట్లాది మంది ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని ఆయన అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో ఉద్రిక్తతలకు దారితీయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. హమారా ప్రసాద్ వ్యాఖ్యలపై పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి, చట్టపరంగా తప్పు జరిగినట్లు తేలితే సంబంధిత నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎర్రోళ్ల సదానందం డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానించే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. అంబేద్కర్ ఆశయాలైన సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం, సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సదానందం పిలుపునిచ్చారు. రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

# చింతకాని ప్రభుత్వ ఆసుపత్రి కి సిరెంజెస్ డొనేట్ చేసిన ఆవుల నాగేశ్వర్రావు



- **పెద ప్రజల ఆరోగ్యం పై స్పందించిన వందనం సర్పంచ్.**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు ):** చింతకాని మండల కేంద్రంలోని ప్రాథమిక ప్రభుత్వ ఆసుపత్రి కి వందనం గ్రామ సర్పంచ్ ఆవుల నాగేశ్వరావు శనివారం నాడు సైరెంజెస్ దానం చేసి మాట్లాడుతూ పెద ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని కోరారు అలాగే గ్రామాలలో ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని అన్నారు, పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ అల్తాఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి కి సైరెంజెస్ డొనేట్ చేయడం మంచి ఆలోచన అని తెలిపారు ఇలాంటి సేవలు ప్రజలకు మరెన్నో చేయాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో చింతకాని గ్రామ సర్పంచ్ కిలారు మనోహర్ బాబు, కాంగ్రెస్ పార్టీ వందన గ్రామ శాఖ అధ్యక్షులు కామసాని శంకర్ రావు, ఉప అధ్యక్షులు పొన్నం శంకర్ రావు, ఉపాధ్యక్షులు షేక్ మోయిన్, టీడీపీ నాయకులు బండి ప్రసాద్, గడ్డం రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ముల్కనూర్‌లో పొన్నం అనూప్ జన్మదిన వేడుకలు



**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో యువజన నాయకుడు పొన్నం అనూప్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. యువజన నాయకుడు జక్కుల అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో యువజన కాంగ్రెస్ నాయకులు వినయ్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పొన్నం అనూప్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

# కృష్ణా జలాల్లో పాలమూరుకు అన్యాయం



- **ఏల్నినో పేరుతో ఏపీకి సాగునీరు తరలిస్తున్నారు**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**పెబ్బేరు,సెప్టెంబర్19(తెలంగాణ ముచ్చట్లు):** కృష్ణా జలాల విషయంలో పాలమూరు ప్రాంతానికి అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు ఆరోపించారు. ఏల్నినో పేరుతో ఏపీకి సాగునీరు తరలిస్తున్నారని విమర్శించారు. ప్రకృతి సమృద్ధిగా నీరు ఇచ్చినా పాలమూరు రైతులకు సాగునీరు అందడం లేదన్నారు. పెబ్బేరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రైతులు విద్యుత్, సాగునీటి సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఆరు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని, లోఓల్టేజీ, తరచూ కోతలతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు చెబుతున్నారని అన్నారు. నీళ్లు, కరెంట్ ఉన్నా రైతులకు అందించలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరులో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని కేటీఆర్ పేర్కొన్నారు. వరదల సమయంలో నీటిని మళ్లించి చెక్‌డ్యామ్‌లు, చెరువులు నింపామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏడు మెగావాట్లుగా ఉన్న విద్యుత్ స్థాపిత సామర్థ్యాన్ని 24 వేల మెగావాట్లకు పెంచామని అన్నారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా ఏపీకి నీళ్లు వెళ్తున్నాయని ఆరోపించిన కేటీఆర్.. జూరాలకు ఎగువ నుంచి నీరు లేదంటూ కాలువలకు నీటి విడుదల నిలిపివేస్తున్నారని అన్నారు. ఏపీకి నీళ్లు వెళ్తున్నప్పుడు తెలంగాణకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కల్వకుర్తి పంపులను తరచూ ఆన్‌ఆఫ్ చేయడం సాధ్యం కాదని, ఒకసారి ప్రారంభిస్తే నిరంతరంగా నడపాల్సి ఉంటుందని తెలిపారు.కర్ణాటక, ఏపీ తమ నీటి ప్రయోజనాల కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాయని, తెలంగాణ మాత్రం కృష్ణా జలాల విషయంలో సరైన ప్రణాళికతో వ్యవహరించడం లేదని కేటీఆర్ విమర్శించారు. ఆలమట్టి ఎత్తు పెంచే యోచనలో కర్ణాటక ఉందని, ఐదు మీటర్ల మేర ఎత్తు పెంచితే భవిష్యత్తులో పాలమూరుకు నీటి లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ఈ అంశంపై కర్ణాటకను ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి సొంత ఊరు, సొంత జిల్లాలోనే రైతులు కరెంట్, సాగునీటి సమస్యలతో రోడ్డెక్కుతున్నారని కేటీఆర్ విమర్శించారు. కృష్ణా జలాల్లో పాలమూరు వాటా దక్కే వరకు ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంలో హైకోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని వ్యాఖ్యానించారు.

# భూమి విషయంలో వివాదం..

- **పంటను దున్ని రూ.95 వేల నష్టం**

**ఖమ్మం బ్యూరో , సెప్టెంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు ):** చింతకాని గ్రామానికి చెందిన నారపోగు వెంకట రామమ్మ (55) తనకు ప్రభుత్వం కేటాయించిన భూమిలో సాగు చేసుకుంటున్న పంటను కొందరు వ్యక్తులు దున్నివేసి నష్టం కలిగించారని పోలీసులకు ఫిర్యాదు చేసింది.పోలీసుల వివరాల ప్రకారం..రామమ్మకు 2016లో తెలంగాణ ప్రభుత్వం ద్వారా 9వ నంబర్ పట్టా కింద గ్రామ శివారులో భూమి ఇచ్చారు. అప్పటి నుంచి ఆ భూమిలో వరి నాట్లు వేసుకుని సాగు చేసుకుంటోంది. ఈ క్రమంలో శనివారం కొందరు వ్యక్తులు ఆమె పొలంలోకి ప్రవేశించి, పొలాన్ని దున్ని పాడుచేయడంతో సుమారు రూ.95 వేల నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొంది.అడ్డుకునేందుకు ప్రయత్నించగా ఇద్దరు వ్యక్తులు దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని, ఈ ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చింతకాని ఎస్ఐ జి. నరేష్ తెలిపారు.

# స్టేషన్ ఘనపూర్ జెడ్పీహెచ్ఎస్ లో ఘనంగా హిందీ దినోత్సవ వేడుకలు



- **హిందీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**

**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం హిందీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ కవుల పరిచయాలు, కవితా గానం, ఉపన్యాసాలు, నాటకాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల హిందీ ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్, వనిత ప్లాటినం క్లబ్ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల సీనియర్ హిందీ ఉపాధ్యాయిని రాగమణి-స్వామి దంపతులు పాఠశాల అభివృద్ధి కోసం రూ.5 వేల విలువైన రంగస్థల తెర, కార్పెట్‌ను అందజేశారు. వారి దాతృత్వాన్ని పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.సంపత్ కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు రవి కుమార్, శ్రీకాంత్, రాగమణి, మంజుల, రజని, శైలజ, జలజ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ధంసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జనంకు ఏర్పాట్లు...

- **జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబరు - 19(తెలంగాణ ముచ్చట్లు ):** గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు.

శనివారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని దంసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పోలీస్ కమీషనర్ సునీల్ దత్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వినాయక నిమజ్జనం పురస్కరించుకొని కావాలసిన సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో గణేష్ ఉత్సవాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు అన్ని సౌకర్యాలతో ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు.

నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువులో నీటిమట్టం ఉన్నందున బారికేడింగ్, గజ ఈతగాళ్ళు, క్రేన్లు, బోట్లు, రక్షణ పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, పోలీసులతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, రాత్రి నిమజ్జనాలకు తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలను ముందుగానే సిద్ధం చేసి, అత్యవసర వాహనాలకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు.

ఎత్తు కలిగిన గణేష్ విగ్రహాలకు ఇబ్బందులు లేకుండా నిమజ్జన ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక రూట్, ట్రాఫిక్, పోలీసు బందోబస్తు, రవాణా ఏర్పాట్లు ముందుగానే చేయాలని ఆదేశించారు.

భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ షాక్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు. ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, 108 వాహనం, పాము కాటు మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించి నిరంతరం పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్లకు అదనపు డ్రైవర్లు, క్రేన్ మరమ్మతులు చేసే మెకానిక్‌లను అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జనం రోజున ఉదయం 6 గంటలకే క్రేన్లు సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. విగ్రహాల తరలింపుకు అడ్డుగా వచ్చే చెట్టు కొమ్మలను ముందుగానే తొలగించాలని అన్నారు.

నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన మేరకు గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా నియమించాలని, స్విమ్మర్లతో ముందుగానే చర్చించి వారికి విధుల షిఫ్ట్ వివరాలను తెలియజేయాలని అన్నారు.

గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన రూట్ మ్యాప్‌ను ముందుగానే సిద్ధం చేయాలని, .

అన్ని శాఖలు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేసి గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ తహసీల్దారు జయచందర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

- **జీవో 97ను రద్దు చేసి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాలి: కసిరెడ్డి మణికంఠ రెడ్డి**




**కరీంనగర్, సెప్టెంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు ):**విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయం ఎల్లారెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా 19వ మహాసభ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మణికంఠ రెడ్డి హాజరయ్యారు. ముందుగా మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్ ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు సొంత డబ్బులతో కళాశాల ఫీజులు చెల్లించి సర్టిఫికెట్లు పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యకు నిధులు విడుదల చేయకపోతే పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యను ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, జీవో నంబర్ 97ను రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. 1000 రోజుల పాలనలో విద్యార్థులకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని, హామీ ఇచ్చిన ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రిక్ స్కూటీలను వెంటనే అందించాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా విడుదల చేయడంతో పాటు విద్యారంగానికి బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

మద్యం శాఖకు మంత్రి ఉన్నప్పుడు విద్యా శాఖకు మంత్రి ఎందుకు లేరని ప్రశ్నిస్తూ, విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని మణికంఠ రెడ్డి కోరారు.

ఈ మహాసభలో జిల్లా అధ్యక్షుడు రామారావు వెంకటేష్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నూనావత్ శ్రీనివాస్ నాయక్, జిల్లా ఆఫీస్ బేరర్స్ కనకం సాగర్, కేశబోయిన రాము, లద్దునూరి విష్ణు, గర్ల్స్ వింగ్ కన్వీనర్ జోష్నా, నాయకులు అనోష్, బోయిని విష్ణు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లు ఘనంగా నిర్వహిస్తాం

- **భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు: మేయర్ కొలగాని శ్రీనివాస్**




**కరీంనగర్, సెప్టెంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు ):** గణేష్ నిమజ్జన వేడుకలు విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.

నగరపాలక సంస్థ పరిధిలో ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమం ఏర్పాట్లపై శనివారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుధ్య విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, షిఫ్టుల వారీగా అధికారులు, సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులపై సుదీర్ఘంగా చర్చించి దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే గణేష్ నిమజ్జన ఉత్సవాలు అత్యంత వైభవంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

మానకొండూర్, కొత్తపల్లి, చింతకుంట, గోపాల్‌పూర్, దుర్షేడ్, బొమ్మకల్ తదితర నిమజ్జన పాయింట్ల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మేయర్ సూచించారు. నిమజ్జన మార్గాలతో పాటు ఘాట్ల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టి అవసరమైన సౌకర్యాలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

నిమజ్జన పాయింట్ల వద్ద భారీ కేడ్లు, సీసీ కెమెరాలు, క్రేన్లు, ఎల్ఈడీ స్క్రీన్లు, విద్యుత్ లైటింగ్, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించి ఎప్పటికప్పుడు పరిశుభ్రతను పర్యవేక్షించాలని ఆదేశించారు.

అలాగే నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, భక్తులు మరియు గణేష్ మండపాల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. షిఫ్టుల వారీగా విధులు కేటాయించి, నిమజ్జనం పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మేయర్ ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కమిషనర్ ఆయాజ్, డిప్యూటీ కమిషనర్లు ఖాదర్ మొహియుద్దీన్, వేణుమాధవ్, అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మారుమూల తండాలో వికసించిన పుష్పం

- **ఉదయశ్రీకి రసాయన శాస్త్రంలో డాక్టరేట్ పట్టా**
- **ముగ్గురు ఆడబిడ్డలకు ఉన్నత విద్య అందించిన తల్లిదండ్రులకు అభినందనలు**



**మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):**గూడూరు మండలంలోని మారుమూల ప్రాంతమైన లక్ష్మీపురం (తీగలవేణి)కు చెందిన బానోతు ఉదయశ్రీ రసాయన శాస్త్ర విభాగంలో డాక్టరేట్ పట్టా పొందారు. నిజామాబాద్‌లోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు డాక్టరేట్ పట్టా అందజేశారు.ఉదయశ్రీ కమ్యూనిస్టు ప్రజాపంథా నాయకుడు, మాజీ సర్పంచ్ బానోతు మంగీలాల్, లలిత దంపతుల పెద్ద కుమార్తె. మారుమూల తండాకు చెందిన కుటుంబం నుంచి వచ్చి ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ సాధించడం పట్ల గ్రామస్థులు, పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగీలాల్, లలిత దంపతులు తమ ముగ్గురు కుమార్తెలకు ఉన్నత విద్య అందించగా, ముగ్గురూ డాక్టరేట్ పట్టాలు సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం వారి కుమారుడు కూడా ఉన్నత విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ ఆత్మాభిమానాన్ని కాపాడుకుంటూ పిల్లల విద్యకు ప్రాధాన్యం ఇచ్చారని గ్రామస్థులు పేర్కొన్నారు. నీతి, న్యాయం, ధర్మానికి కట్టుబడి తమకు చేతనైనంత మేరకు ఇతరులకు నిస్వార్థంగా సేవ చేస్తూ జీవిస్తున్న కుటుంబంగా మంగీలాల్ కుటుంబానికి మంచి గుర్తింపు ఉందని తెలిపారు.ఉదయశ్రీ డాక్టరేట్ సాధించిన విషయం తెలుసుకున్న నర్సంపేట నియోజకవర్గం పోటీ చేసిన అభ్యర్థి తెలంగాణ శ్రీనివాస్ నాయక్ నిజామాబాద్‌కు వెళ్లి ఆమెను అభినందించారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తనకు ఆడబిడ్డలు లేరని, ఉదయశ్రీ వంటి ఆడబిడ్డ ఉన్నత విద్యలో రాణించడం ఆనందంగా ఉందని భావోద్వేగంతో పేర్కొన్నారు.

# లింగాన్ని మింగొద్దు!

బాలరాముడు కలలోకొచ్చి
గుచ్చి గుచ్చి చెప్పినా
'వాళ్లు' వినలేదు!

గుడినిమింగినా
లింగాన్నిమింగొద్దని
సామెత ఉంది!
ఐనా లెక్కలేదు!

గుడినిమింగినవాళ్లు
చాలామంది ఉన్నారు!
లింగాన్నిమిగల్చబట్టి
భక్తులొచ్చేవాళ్ళు!

'వీళ్లు' అలాకాదుగా!
గుడినిలింగాన్ని
మొత్తంమింగేసారు!
అదివాళ్ళ అత్యాశ!

బంగారుబాతుకథ
ఇదీ తెలుసు 'వీళ్ళకి'!
రోజుకో బంగారు గుడ్డు!
ఆది చాలలేదు!

బాతునుకోసేశారు!
ఇంకేముంది ఐపాయె!
గుడిలేదు లింగంలేదు!
ఎంతకష్టం తెచ్చారు!

నీతి :'ధర్మ'కర్తలారా!
గుడిని మింగినా
లింగాన్ని మింగకండి!
దురాశ ఎంతో దుఃఖం!

- తమ్మినేని అక్కిరాజు,
హైదరాబాద్

# నరకప్రాయంగా మారిన జాతీయ రహదారి 65

- గడువు దాటినా పూర్తి కాని పనులు..
- అత్యవసర సేవలకు అంతరాయం
- ప్రయాణికులు, స్థానికుల తీవ్ర ఇక్కట్లు
- అసంపూర్తి నిర్మాణాలు, నాణ్యతా లోపాలపై పర్యవేక్షణ కరువు
- ఆందోళన వ్యక్తం చేసిన నవభారత్ నిర్మాణ యువసేన అధ్యక్షుడు మెట్టు శ్రీధర్







**పటాన్‌చెరు, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** సంగారెడ్డి ఎక్స్‌రోడ్స్ నుంచి మదీనగూడ వరకు జాతీయ రహదారి 65పై చేపట్టిన ఆరు వరుసల రహదారి విస్తరణ పనులు నిర్ణయించిన గడువు దాటినా పూర్తికాకపోవడంపై నవభారత్ నిర్మాణ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర యువజన సంఘాల సమితి ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ ఆందోళన వ్యక్తం చేశారు.కిలోమీటర్ 493/000 నుంచి 524/000 వరకు 29.35 కిలోమీటర్ల మేర చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రూ.1,297.75 కోట్ల వ్యయం మంజూరైనట్లు తెలిపారు. పనుల అసలు పూర్తి గడువు జూలై 3, 2026కాగా, అనంతరం కేంద్ర ప్రభుత్వ పార్లమెంటరీ సమాచారంలో మార్చి 31, 2027 వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. అదే సమాచారంలో ప్రస్తుతానికి ప్రాజెక్టు పనులు 32 శాతం మాత్రమే పూర్తయినట్లు వెల్లడైందన్నారు.రూ.1,297 కోట్లకు పైగా ప్రజాధనంతో చేపట్టిన 29.35 కిలోమీటర్ల రహదారి పనుల్లో ఇప్పటివరకు 32 శాతం మాత్రమే భౌతిక పురోగతి నమోదవడం ఆందోళన కలిగించే అంశమని మెట్టు శ్రీధర్ అన్నారు. పలుచోట్ల సగం పనులు చేసి వదిలేయడం, రహదారి నిర్మాణాన్ని పూర్తి స్థాయిలో చేపట్టకపోవడంతో ప్రయాణికులు, స్థానిక ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ముఖ్యంగా రద్దీ సమయాల్లో కొద్ది కిలోమీటర్ల ప్రయాణానికే గంటల తరబడి సమయం పడుతోందని, అంబులెన్సులు వంటి అత్యవసర సేవలకు కూడా తీవ్ర అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. రహదారి నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయని అన్నారు.సర్వీస్ రోడ్ల నిర్మాణంలోనూ నాణ్యతా ప్రమాణాలపై ప్రజల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. నిర్మాణ ప్రాంతాల్లో భారీగా దుమ్ము లేవడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దుమ్ము నియంత్రణకు క్రమం తప్పకుండా నీటిని చల్లడం వంటి చర్యలు చేపట్టాలని కోరారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి పనుల నాణ్యతను పరిశీలించాలని మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు. నాణ్యతా లోపాలు గుర్తిస్తే కాంట్రాక్టర్‌ను హెచ్చరించడంతో పాటు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. రహదారి, సర్వీస్ రోడ్లు, బాక్స్ డ్రైన్లు, నిర్మాణ సామగ్రి తదితర పనులపై నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని, లోపాలు ఉన్నట్లు తేలితే వాటిని కాంట్రాక్టర్‌తో సరిచేయించాలని అన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన రహదారిని అందించాలని కోరారు. ప్రజాధనం భారీగా ఖర్చు చేస్తున్న ఈ ప్రాజెక్టులో నాణ్యత, భద్రత, సమయ పాలన విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు.



# జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిని కలిసిన పీచర కాంగ్రెస్ నాయకులు

**వేలేరు, సెప్టెంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాం రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ బలోపేతం, పార్టీ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీచర మాజీ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మంతపురి రాజుతో పాటు జల్తారు శ్రీనివాస్, కదియాల మహేందర్, పెండ్లి వెంకటేష్, నాగపూరి గౌరీశంకర్ పాల్గొన్నారు.

# ఖర్చెంతైనా బాధ్యత నాదే

- రహీమున్నీసా బేగం ఆరోగ్యానికి ఎమ్మెల్యే నాయిని భరోసా
- జీవితం మొత్తం సమాజం కోసం పాటుపడిన ఉద్యమకారిణికి అండగా ఉంటానని హామీ





**హనుమకొండ, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):** ఉద్యమ సమయంలో ప్రజల కోసం ముందుండి పోరాడిన ఉద్యమకారిణి రహీమున్నీసా బేగం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ఆమెను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఊపిరితిత్తుల సమస్యతో హనుమకొండలోని ఏకశిలా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రహీమున్నీసా బేగం ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ "చికిత్సకు ఖర్చెంతైనా పర్వాలేదు.. మెరుగైన వైద్యం అందించడం మన బాధ్యత. రహీమున్నీసా బేగం ఆరోగ్యం కోసం అవసరమైన సహాయం అందిస్తాను" అని భరోసా ఇచ్చారు.

తన జీవితాన్ని కుటుంబం కంటే సమాజానికి, ప్రజల కోసం అంకితం చేసిన రహీమున్నీసా బేగం వంటి ఉద్యమకారిణి కష్టకాలంలో ఒంటరిగా ఉండకూడదనే ఉద్దేశంతో ఆమె కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. "మీ కుటుంబానికి నేను ఉన్నాను.. ధైర్యంగా ఉండండి" అంటూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.రహీమున్నీసా బేగం త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని నాయిని రాజేందర్ రెడ్డి ఆకాంక్షించారు.



# గాయపడిన లక్ష్మణ్ నాయక్‌ను ఎంజీఎంలో పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వేలేరు, సెప్టెంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ మండలం కేశవనగర్ గ్రామం సమీపంలో గుర్తుతెలియని దుండగుల దాడిలో తీవ్రంగా గాయపడి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మురావత్ లక్ష్మణ్ నాయక్‌ను మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం పరామర్శించారు.

ఎంజీఎం ఆసుపత్రికి చేరుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, లక్ష్మణ్ నాయక్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు వైద్యుల బృందానికి సూచించారు. అనంతరం బాధితుడు, కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా పూర్తి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇటువంటి భౌతిక దాడులు హేయమైన చర్యలని పేర్కొన్నారు. రాజకీయాలు లేదా ఇతర కారణాలతో హింసాత్మక ఘటనలకు తావు లేదని స్పష్టం చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యుల బృందం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో కరవుపై హరీశ్‌రావు విమర్శలు

- కృష్ణా జలాల వినియోగంపై ప్రశ్నలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులపై మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ప్రకృతి వైపరీత్యాల వల్ల కాకుండా ప్రభుత్వ వైఫల్యాల ఫలితమని ఆరోపించారు. రాష్ట్రంలో సాగునీటి నిర్వహణ, జల వనరుల వినియోగంలో ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించలేకపోయిందని అన్నారు. ముఖ్యంగా కృష్ణా జలాల వినియోగంలో నిర్లక్ష్యం కారణంగా వ్యవసాయ రంగం నష్టపోతోందని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సమయంలో నీటి సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రభుత్వం వెల్లడించిన కృష్ణా జలాల వినియోగ గణాంకాలపై సందేహాలు వ్యక్తం చేశారు. శ్రీశైలం జలాశయం నుంచి భారీ స్థాయిలో నీటిని వినియోగించుకున్నట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా మళ్లించిన నీటి పరిమాణం అధికారిక ప్రకటనలకు సరిపోలడం లేదని ఆరోపించారు. ప్రాజెక్టుల సామర్థ్యానికి తగ్గట్టుగా నీటిని వినియోగించడంలో లోపాలు ఉన్నాయని తెలిపారు. సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మరింత చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు.

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో సాంకేతిక సమస్యలు కొనసాగుతున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. పథకంలో ఉన్న మోటార్లన్నీ పూర్తిస్థాయిలో పనిచేయకపోవడం వల్ల నీటి ఎత్తిపోతలు ఆశించిన స్థాయిలో జరగడం లేదని అన్నారు. రైతులకు అవసరమైన సమయంలో నీరు అందక పంటలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతుల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు సమర్థంగా పనిచేస్తేనే కరవు పరిస్థితులను అధిగమించవచ్చని అభిప్రాయపడ్డారు. కృష్ణా నదీ జలాల వినియోగానికి సంబంధించి గత కొన్ని సంవత్సరాల గణాంకాలను ప్రస్తావిస్తూ తెలంగాణకు రావలసిన నీటి వినియోగంలో తగ్గుదల కనిపిస్తోందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణకు అందుతున్న నీటి వినియోగం తక్కువగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో ప్రభుత్వం మరింత చురుకుదనం ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ హక్కులను కాపాడేందుకు అన్ని స్థాయిల్లో చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతాంగ ప్రయోజనాల కోసం నీటి నిర్వహణలో స్పష్టమైన కార్యాచరణ అవసరమని అభిప్రాయపడ్డారు. నీటి లభ్యత ఉన్నప్పటికీ దానిని వ్యవసాయ అవసరాలకు వినియోగించడంలో ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. అవసరమైన మౌలిక సదుపాయాలు, పంపింగ్ వ్యవస్థలు ఉన్నా సరైన ప్రణాళికల కొరత వల్ల ప్రయోజనం లేకుండా పోతోందని విమర్శించారు. రైతుల అవసరాలను ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవాల్సిందని అన్నారు. కరవు పరిస్థితులు మరింత తీవ్రం కాకముందే ప్రభుత్వం అప్రమత్తమై చర్యలు చేపట్టాలని కోరారు. వ్యవసాయ రంగాన్ని కాపాడటానికి నీటి నిర్వహణ కీలకమని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాజెక్టుల ద్వారా నీటి వినియోగంపై కూడా హరీశ్‌రావు స్పందించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే అంశాలపై ప్రభుత్వం గట్టిగా స్పందించాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ హక్కులకు సంబంధించిన విషయాల్లో ప్రభుత్వం మౌనంగా ఉండకుండా చొరవ చూపాలని కోరారు. కృష్ణా జలాల పంపిణీ, వినియోగానికి సంబంధించిన అన్ని అంశాలను ప్రజల ముందుంచి పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. రైతాంగ సంక్షేమం, సాగునీటి భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# జనసేన లీగల్ సెల్‌కు రూపకల్పన

- రాష్ట్ర స్థాయి న్యాయవాదుల సమావేశం
- జిల్లాల వారీగా విస్తరణకు కార్యాచరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు)** జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో శనివారం రాష్ట్ర స్థాయి న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి అనుబంధంగా పనిచేస్తున్న న్యాయవాదులు, న్యాయ నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడం, లీగల్ సెల్‌ను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జనసేన మహిళా నాయకురాలు శిరీష పొన్నూరు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, న్యాయవాదులు, లీగల్ ప్రొఫెషనల్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత విస్తరించే అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో జనసేన ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్, తెలంగాణ ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్, ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్, ఉమ్మడి వరంగల్-నల్గొండ-ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాస్ ప్రసంగించారు. పార్టీ కార్యకలాపాల్లో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, న్యాయపరమైన అంశాలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణలో న్యాయవాదుల సహకారం అవసరమని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో పార్టీ చేపట్టే కార్యక్రమాలకు న్యాయపరమైన బలాన్ని అందించే దిశగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణలోని అన్ని జిల్లాలకు చెందిన న్యాయవాదులు, లీగల్ ప్రొఫెషనల్స్‌తో సమన్వయం పెంచుతూ రాష్ట్రవ్యాప్తంగా బలమైన లీగల్ సెల్ ఏర్పాటు చేయాలనే అంశంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రతి జిల్లా కేంద్రంలో న్యాయవాదుల బృందాలను ఏర్పాటు చేసి పార్టీ కార్యక్రమాలకు న్యాయపరమైన మద్దతు అందించే విధంగా ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయ వ్యవస్థను బలోపేతం చేయాలని నాయకులు సూచించారు. న్యాయరంగంలో సేవలందిస్తున్న యువ న్యాయవాదులను కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని అభిప్రాయపడ్డారు. ప్రతి జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్లతో సంప్రదింపులు జరిపి న్యాయవాదులను లీగల్ సెల్ కార్యకలాపాల్లో భాగస్వాములను చేయాలని సమావేశంలో తీర్మానించారు. ప్రజలకు న్యాయపరమైన అవగాహన కల్పించడం, అవసరమైన సందర్భాల్లో న్యాయ సలహాలు అందించడం, చట్టపరమైన అంశాలపై మార్గనిర్దేశం చేయడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని ప్రతిపాదించారు. న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలని నాయకులు సూచించారు. సమాజంలో న్యాయ అవగాహన పెంపొందించడంలో లీగల్ సెల్ కీలక పాత్ర పోషించగలదని పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభం

- **రెండు రోజుల ఆలస్యంగా ఉపసంహారణ**
- **దేశవ్యాప్తంగా 15 శాతం వర్షపాతం లోటు**
- **ఎల్‌నినో ప్రభావంతో తగ్గిన వర్షా లు**
- **రాజస్థాన్ నుంచి వెనక్కి వెళ్తున్న రుతుపవనాలు**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు)** దేశంలో నైరుతి రుతుపవనాల కాలం ముగింపు దశకు చేరుకుంది. పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైనట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. సాధారణంగా సెప్టెంబర్ 17 నుంచే ఈ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా, ఈ ఏడాది రెండు రోజుల ఆలస్యంగా సెప్టెంబర్ 19న ప్రారంభమైంది. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాబోయే మూడు నుంచి నాలుగు రోజుల్లో రాజస్థాన్‌లోని మరిన్ని ప్రాంతాలతో పాటు పంజాబ్, కచ్, సౌరాష్ట్ర ప్రాంతాల నుంచి కూడా రుతుపవనాలు వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితులు దీనికి అనుకూలంగా మారుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఈ ఏడాది జూన్ 4న కేరళలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు క్రమంగా దేశవ్యాప్తంగా విస్తరించాయి. జులై 9 నాటికి దేశమంతా వ్యాపించిన రుతుపవనాలు ఇప్పుడు ఉపసంహరణ దశలోకి ప్రవేశించాయి. అయితే ఈ సీజన్‌లో దేశంలోని అనేక ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదు. జూన్ 4 నుంచి సెప్టెంబర్ 19 వరకు దేశవ్యాప్తంగా సగటున 15 శాతం వర్షపాతం లోటు నమోదైంది. దక్షిణ ద్వీపకల్ప ప్రాంతంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉండగా, అక్కడ 29 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్ నెలలో 35 శాతం వర్షపాతం లోటు నమోదవగా, జులైలో మాత్రమే సాధారణం కంటే స్వల్పంగా అధిక వర్షపాతం కురిసింది. ఆగస్టు నెలలో కూడా వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదు. 2001 తర్వాత ఆగస్టు నెలలో నమోదైన అత్యల్ప వర్షపాతాల్లో ఇది ఏడో స్థానంలో నిలిచింది. వ్యవసాయ రంగంపై దీని ప్రభావం కనిపించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది వర్షపాతం తగ్గడానికి ప్రధాన కారణంగా ఎల్‌నినో పరిస్థితులను వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఉష్ణోగ్రతల మార్పులు ప్రపంచ వాతావరణంపై ప్రభావం చూపాయని వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో సాధారణ వర్షాలు తగ్గడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో అకాల వర్షాలు, ఉరుములు, మెరుపులు, వడగండ్ల వానలు కూడా నమోదయ్యాయి. రుతుపవనాల ఉపసంహారణ పూర్తయ్యే వరకు కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది.

# విద్యార్థి శక్తికి క్రీడలే పునాది





- **యువతలో ఆరోగ్య చైతన్యం పెంపు**
- **విశ్వవిద్యాలయ క్రీడల ప్రాధాన్యం**
- **ఐక్యతకు క్రీడలు వారధి**
- **భవిష్యత్ నాయకత్వానికి క్రీడా స్ఫూర్తి**

**డెస్క్, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు)** అంతర్జాతీయ విశ్వవిద్యాలయ క్రీడల దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించబడుతుంది. ఉన్నత విద్యాసంస్థల్లో క్రీడల ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ యువతలో ఆరోగ్యకర జీవన విధానాన్ని ప్రోత్సహించడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం. విద్యతో పాటు క్రీడలు కూడా సమానంగా అవసరమనే సందేశాన్ని ఇది ప్రపంచానికి అందిస్తోంది. శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా గుర్తు చేస్తారు. ప్రస్తుత కాలంలో విద్యార్థుల జీవితం పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలు, సాంకేతిక వినియోగం చుట్టూ తిరుగుతోంది. దీనివల్ల శారీరక శ్రమ తగ్గిపోగా, ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. గంటల తరబడి కూర్చొని చదవడం, మొబైల్ ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాల వినియోగం పెరగడం వల్ల యువతలో శారీరక చురుకుదనం తగ్గుతోంది. ఈ పరిస్థితుల్లో క్రీడలు ఆరోగ్యకర జీవనానికి అత్యవసరంగా మారాయి. విశ్వవిద్యాలయ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా యువతలో ఆరోగ్య చైతన్యాన్ని పెంచవచ్చు.

క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కావు. అవి వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు, సమయపాలనకు, జట్టు భావనకు పునాది వేస్తాయి. ఒక విద్యార్థి క్రీడల్లో పాల్గొనడం ద్వారా విజయాలను మాత్రమే కాకుండా ఓటములను కూడా ధైర్యంగా ఎదుర్కోవడం నేర్చుకుంటాడు. ఈ లక్షణాలు భవిష్యత్ జీవితంలో ఎన్నో సవాళ్లను అధిగమించడానికి ఉపయోగపడతాయి. అందుకే ప్రపంచవ్యాప్తంగా విద్యాసంస్థలు క్రీడలను విద్యలో భాగంగా భావిస్తున్నాయి. విశ్వవిద్యాలయ క్రీడలు విద్యార్థుల మధ్య ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. భిన్న ప్రాంతాలు, భాషలు, సంస్కృతులకు చెందిన విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని పరస్పర అవగాహన పెంచుకుంటారు. క్రీడా పోటీలు స్నేహబంధాలను బలోపేతం చేస్తాయి. సమానత్వం, పరస్పర గౌరవం, సహకారం వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందిస్తాయి. ఈ కారణంగానే క్రీడలను సామాజిక ఐక్యతకు ప్రతీకగా భావిస్తారు.

అంతర్జాతీయ స్థాయిలో అనేక మంది ప్రముఖ క్రీడాకారులు తమ ప్రస్థానాన్ని విశ్వవిద్యాలయ క్రీడల నుంచే ప్రారంభించారు. విద్యాసంస్థలు ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి శిక్షణ, సదుపాయాలు అందిస్తే అంతర్జాతీయ స్థాయిలో దేశానికి గుర్తింపు తీసుకురాగలరు. క్రీడా ప్రతిభను పెంపొందించేందుకు విశ్వవిద్యాలయాలు కీలక కేంద్రాలుగా మారాలి. క్రీడలు మరియు విద్యను సమన్వయం చేసినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. భారతదేశంలో కూడా విశ్వవిద్యాలయ క్రీడలకు ప్రాధాన్యం క్రమంగా పెరుగుతోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. అనేక విశ్వవిద్యాలయాలు ఆధునిక క్రీడా మైదానాలు, శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాయి. అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రతిభకు ఇంకా మరింత అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. క్రీడా మౌలిక సదుపాయాల విస్తరణపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

క్రీడలు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలను తగ్గించడంలో క్రీడలు సహాయపడతాయి. శారీరక వ్యాయామం ద్వారా ఉత్సాహం పెరిగి ఆత్మవిశ్వాసం మెరుగుపడుతుంది. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు సాధారణంగా మరింత చురుకుగా, ఏకాగ్రతతో ఉంటారని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమైనది. ఆరోగ్యవంతమైన యువతే దేశాభివృద్ధికి బలమైన పునాది. క్రీడలను అలవాటు చేసుకున్న యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటమే కాకుండా సమాజానికి సానుకూల దిశలో నాయకత్వం వహించగలరు. అందుకే విద్యాసంస్థలు క్రీడలను అదనపు కార్యక్రమంగా కాకుండా విద్యలో అంతర్భాగంగా చూడాలి.

అంతర్జాతీయ విశ్వవిద్యాలయ క్రీడల దినోత్సవం సందర్భంగా క్రీడల పట్ల యువతలో ఆసక్తిని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. క్రీడా పోటీలు, అవగాహన సదస్సులు, ఆరోగ్య కార్యక్రమాల ద్వారా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఈ కార్యక్రమాలు క్రీడల ప్రాముఖ్యతను మరింత విస్తృతంగా తెలియజేస్తున్నాయి. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదం చేయవచ్చు. విద్య, ఆరోగ్యం, క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వం వంటి అనేక విలువలను ఒకే వేదికపై అందించగల శక్తి క్రీడలకు ఉంది. అంతర్జాతీయ విశ్వవిద్యాలయ క్రీడల దినోత్సవం ఈ సత్యాన్ని ప్రపంచానికి మరోసారి గుర్తు చేస్తోంది. యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంచడం, ప్రతి విద్యాసంస్థలో క్రీడా సంస్కృతిని బలోపేతం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన, సమైక్యమైన, శక్తివంతమైన సమాజాన్ని నిర్మించవచ్చు. క్రీడల ద్వారా వ్యక్తిగత విజయంతో పాటు జాతీయ గౌరవాన్ని కూడా సాధించవచ్చనే సందేశాన్ని ఈ దినోత్సవం అందిస్తోంది.

# భూస్థిర కక్ష్యలో ఈఓఎస్-05 విజయం



- **నిరంతర నిఘా సామర్థ్యానికి బలం**
- **వ్యూహాత్మక సమాచార సేకరణలో ముందడుగు**
- **అంతరిక్ష భద్రతలో భారత్ కొత్త అధ్యాయం**
- **రక్షణ అవసరాలకు ఆధునిక ఉపగ్రహం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు)** భారత్ అంతరిక్ష రంగంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. భూస్థిర కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టిన ఈఓఎస్05 ఉపగ్రహం దేశానికి నిరంతర నిఘా సామర్థ్యాన్ని అందించనుందని అంతర్జాతీయ విశ్లేషణలు పేర్కొంటున్నాయి. ఉపగ్రహ సాంకేతికతలో ఈ అభివృద్ధి వల్ల భారత ఉపఖండం పరిధిలోని కీలక ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ సాధ్యమవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా సంక్షోభ పరిస్థితులు, భద్రతా సవాళ్ల సమయంలో వ్యూహాత్మక సమాచారాన్ని వేగంగా సేకరించేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. సెప్టెంబర్ 4న జీఎస్ఎల్‌వీఎఫ్17 రాకెట్ ద్వారా ఈఓఎస్05 ఉపగ్రహాన్ని భూస్థిర కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. భూమికి సుమారు 34,900 నుంచి 35,900 కిలోమీటర్ల ఎత్తులో ఉండే ఈ కక్ష్యలో ఉపగ్రహం భూమి భ్రమణ వేగానికి అనుగుణంగా కదులుతుంది. దీంతో ఒకే ప్రాంతాన్ని నిరంతరంగా గమనించే అవకాశం లభిస్తుంది. గతంలో ఉపయోగిస్తున్న దిగువ భూకక్ష్య ఉపగ్రహాల కంటే ఇది భిన్నమైన ప్రయోజనాన్ని అందిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఈఓఎస్05 దేశానికి వ్యూహాత్మక సమాచారాన్ని అందించే తొలి ప్రత్యేక ఇమేజింగ్ ఉపగ్రహంగా నిలుస్తుందని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ పేర్కొన్నారు. సరిహద్దు ప్రాంతాలు, సముద్ర జలాలు, కీలక రక్షణ స్థావరాల పరిసరాల్లో జరిగే కదలికలను ఎప్పటికప్పుడు గమనించేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. నిరంతర పరిశీలన ద్వారా భద్రతా వ్యవస్థలకు సమయానుకూల సమాచారం అందే అవకాశాలు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. భారత్ ఇప్పటికే పలు నిఘా ఉపగ్రహాలను దిగువ భూకక్ష్యలో నిర్వహిస్తోంది. అవి అత్యంత స్పష్టమైన చిత్రాలను అందించినప్పటికీ ఒక ప్రాంతాన్ని నిరంతరం గమనించే సామర్థ్యం పరిమితంగానే ఉంటుంది. ఉపగ్రహాలు భూమి చుట్టూ వేగంగా తిరుగుతుండటంతో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి కదిలిపోతాయి. ఈ నేపథ్యంలో భూస్థిర కక్ష్యలో ఉన్న ఈఓఎస్05 నిరంతర పర్యవేక్షణకు అనుకూలంగా మారింది. దీనివల్ల గతంలో ఉన్న పరిమితులు గణనీయంగా తగ్గనున్నాయి. సైనిక మరియు వ్యూహాత్మక అవసరాల దృష్ట్యా ఈ ఉపగ్రహం ప్రాధాన్యం మరింత పెరిగింది. లక్ష్యాలను గుర్తించిన తర్వాత వాటి కదలికలను నిరంతరం గమనించే అవకాశం ఉండటంతో నిర్ణయాలు వేగంగా తీసుకునే పరిస్థితి ఏర్పడుతుంది. భద్రతా సంస్థలకు సమయానుకూల సమాచారం అందించడం ద్వారా సమన్వయం మెరుగుపడే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆధునిక నిఘా వ్యవస్థల్లో నిరంతర సమాచార ప్రవాహం అత్యంత కీలక అంశంగా భావిస్తున్నారు. అంతరిక్ష ఆధారిత నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ ముందుకు సాగుతోంది. 2024లో కేంద్ర భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదించిన స్పేస్ బేస్డ్ సర్వైలెన్స్3 కార్యక్రమం కింద 52 రక్షణ ఉపగ్రహాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. వీటిలో 21 ఉపగ్రహాలను ఇస్రో, 31 ఉపగ్రహాలను ప్రైవేటు రంగ సంస్థలు రూపొందించనున్నాయి. ఈ కార్యక్రమం పూర్తయితే దేశ భద్రత, సముద్ర పర్యవేక్షణ, సరిహద్దు నిఘా, వ్యూహాత్మక సమాచార సేకరణ సామర్థ్యాలు మరింత విస్తరించనున్నాయి.

# డిసెంబరులో ఐపీఎల్ 2027 మినీ వేలం




**ముంబై సెప్టెంబరు 19 (తెలంగాణ ముచ్చట్లు):** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 సీజన్ మినీ వేలానికి సంబంధించి కీలక అప్‌డేట్ వెలువడింది. క్రిక్‌ఇన్ఫో కథనం ప్రకారం, ఈ మినీ వేలం డిసెంబర్ రెండో వారంలో (డిసెంబర్ 7 నుండి 13 మధ్య) జరిగే అవకాశం ఉంది. గత మూడు సీజన్లుగా దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో జరిగిన ఈ వేలం, ఈసారి మళ్లీ భారత గడ్డపైనే నిర్వహించేందుకు బీసీసీఐ సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుత సైకిల్‌లో జరగబోయే ఆఖరి మినీ వేలం ఇదే కావడం విశేషం. వేలం వేదిక ఎంపికపై ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ స్పందిస్తూ.. డిసెంబర్ నెలలో దేశవ్యాప్తంగా వివాహాల సీజన్ ఎక్కువగా ఉండటం వల్ల 10 ఫ్రాంచైజీలకు కావలసిన వందకు పైగా హోటల్ గదుల లభ్యత ఆధారంగా తుది నగరం, షెడ్యూల్‌ను ఖరారు చేస్తామని తెలిపారు. ఈ మినీ వేలంలో జట్లు తమ పాత ఆటగాళ్లను చాలావరకు అట్టేపెట్టుకునే అవకాశం ఉంది. 2027 సీజన్ కోసం ప్రతి ఫ్రాంచైజీ బేస్‌లైన్ పర్స్ విలువ రూ. 120 కోట్లు కాగా, మొత్తం సాలరీ క్యాప్‌ను రూ. 157 కోట్లుగా నిర్ణయించారు. ఇక మ్యాచ్‌లో ఉపయోగించే వివాదాస్పద 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధన కొనసాగింపుపై గవర్నింగ్ కౌన్సిల్ త్వరలోనే సమీక్షించనుంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in